సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 10 । మార్చి । 2023



పోటాపోటీగా ఎమ్మెల్సీ ప్రచారం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా ప్రచారం జోరందుకుంది. 8లో▸



దుర్వినియోగం చేస్తున్న కేంద్రం

కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆరోపించారు. 8లో▸



ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

ఆరోగ్యం విషయంలో మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోతీ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ఇబ్రహీంపట్నం డిపోలో సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం: గుండెపోటుకు గురై అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రావు అన్నారు. ఆర్టీసీ డిపోలో గురువారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా శ్వాస తీసుకోలేనప్పుడు.. గుండె నొప్పితో బాధపడుతున్నప్పుడు.. సరైన వైద్యం లభించే వరకు లేదా అంబులెన్స్ వచ్చేవరకు సీపీఆర్ చేయడం ద్వారా మనిషి ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కోటిరెడ్డి, స్టేట్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కోఆర్డినేటర్ విజయ్‌భాస్కర్, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు పాండుగౌడ్, విజయ్‌కుమార్, కోశాధికారి రాఘవరెడ్డి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సతీష్‌వర్మ, డీఎం అశోక్‌రాజు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

చర్లపల్లికి హరిహరకృష్ణ

ముగిసిన ఏడు రోజుల కస్టడీ

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇంజనీరింగ్ విద్యార్థి నవీన్ దారుణ హత్య సంఘటనలో ప్రధాన నిందితుడు హరిహరకృష్ణ పోలీస్ కస్టడీ ముగిసింది. దీంతో గురువారం అతనికి వైద్య పరీక్షలు నిర్వహించి, తిరిగి చర్లపల్లి జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా హరిహరకృష్ణను విచారించిన పోలీసులకు హత్య సమయంలో జరిగిన ఒళ్లు గగుర్పొడిచే వాస్తవాలను వెల్లడించడం తెలిసిందే. ఇందుకు హసన్, నిహారికారెడ్డి సహకరించినట్లు ఒప్పుకోవడంతో వారిద్దరిని కూడా రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే.

హ్యాపీ జర్నీ!

సిటీ ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

- మహిళలు, సీనియర్ సిటిజన్‌లకు టి- 6 టికెట్
- రూ.50కే ఆరు గంటలు ప్రయాణించే అవకాశం
- కుటుంబ సభ్యులు, స్నేహితుల కోసం ఎఫ్- 24
- రూ.300తో నలుగురికి ప్రయాణ సదుపాయం
- నేటి నుంచి నగరంలో అమలు: ఆర్టీసీ ఎండీ సజ్జనార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: సిటీ ప్రయాణికులకు గ్రేటర్ ఆర్టీసీ తీపికబురు అందించింది. నగరవాసులతో పాటు పర్యాటకులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. మహిళలు, సీనియర్ సిటిజన్స్ రూ.50 టికెట్‌పై 6 గంటల పాటు సిటీలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా జర్నీ చేయొచ్చు. ఫ్యామిలీ ప్యాకేజీలో భాగంగా నలుగురు కుటుంబ సభ్యులు కలిసి ప్రయాణం చేసేందుకు రూ.300తో ఎఫ్-24 టికెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ రెండు కొత్త ఆఫర్‌లు నేటి నుంచే అమల్లోకి వస్తాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ గురువారం బస్‌భవన్‌లో అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

24 గంటల ప్రయాణ సదుపాయం..

వారాంతాలు, సెలవు దినాల్లో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ప్రయాణించేందుకు వీలుగా ఫ్యామిలీ- 24 టికెట్‌ను అందుబాటులోకి తెచ్చారు. రూ.300 చెల్లిస్తే.. నలుగురు కలిసి 24 గంటల పాటు సిటీ ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో ప్రయాణించవచ్చు. ఐదేళ్లు దాటిన (5 ఏళ్ల లోపు చిన్నారులకు ప్రయాణం ఉచితం) వారు ఫ్యామిలీ- 24 టికెట్ తీసుకోవచ్చు. శని, ఆదివారాలతో పాటు సెలవు దినాల్లో మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్ పర్యటనకు వచ్చే ఇతర ప్రాంతాలకు చెందిన వారు, వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు సైతం ఈ టికెట్‌పై రోజంతా ప్రయాణం చేయొచ్చు. ప్రస్తుతం నగరంలో టి-24 టికెట్ అందుబాటులో ఉంది. దీనిపై 24 గంటల పాటు ప్రయాణం చేయవచ్చు. టీ-24 ధర పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.60 చొప్పున ఉంటుంది. టీ- 24 (ట్రావెల్ యాజ్ యూ లైక్) టికెట్‌కు కొనసాగింపుగానే తగ్గింపు ధరలతో ఫ్యామిలీ-24ను ప్రవేశపెట్టారు.

అతివలు, వయోధికులకు ప్రయోజనం..

మహిళలు, సీనియర్ సిటిజన్ల సౌకర్యం కోసం అందుబాటులోకి తెచ్చిన టి-6 టికెట్ రూ.50కు లభిస్తుంది. దీనిపై గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సిటి ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో 6 గంటల పాటు ఎక్కడైనా ప్రయాణించవచ్చు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఈ టికెట్‌లు చెల్లుబాటులో ఉంటాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ టికెట్‌ను బస్సులో కండక్టర్ ఇస్తారు. మధ్యాహ్నం 2 తర్వాత టి-6 టికెట్లు లభించవు. 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్‌లు సైతం టి-6 టికెట్‌లపై 6 గంటల పాటు ప్రయాణం చేయవచ్చు. టికెట్ తీసుకునే సమయంలో వయసు ధ్రువీకరణ కోసం కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపించాల్సి ఉంటుంది.

టీ- 24కి అనూహ్య స్పందన..

నగరంలో అందుబాటులో ఉన్న టీ-24 టికెట్‌కు ప్రయాణికుల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి వరకు 33.38 కోట్ల మంది సిటీ బస్సుల్లో ప్రయాణం చేయగా, వారిలో 55.50 లక్షల మంది టీ- 24 టికెట్లను కొనుగోలు చేశారు. ప్రతి రోజు సగటున 25 వేల వరకు అమ్ముడవుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ప్రయాణికులకు, పర్యాటకులకు మరింత చేరువయ్యేందుకు టి-6, ఫ్యామిలీ-24 టికెట్లను ప్రవేశపెట్టారు. 'సాధారణంగా టి-24 టికెట్ అయితే.. నలుగురికి రూ.400 చెల్లించాల్సి ఉంటుంది. ఫ్యామిలీ-24తో ముగ్గురికి రూ.300 చెల్లించి నలుగురు ప్రయాణం చేయొచ్చు' అని సజ్జనార్ చెప్పారు. ఆయా టికెట్లకు సంబంధించిన పూర్తి వివరాలకు టీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040- 69440000, 040- 23450033లను సంప్రదించాలని సూచించారు.



బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు, మృతుడి కుటుంబ సభ్యులు

మాటువేసి..కత్తులు దూసి

- గిరిజన యువకుడి దారుణ హత్య
- ప్రాణాలు తీస్తున్న ప్రేమ వ్యవహారాలు
- నిందితులపై చర్యలకు బీజేపీ, గిరిజన సంఘాల డిమాండ్



పవన్ నాయక్ (ఫైల్)

పహాడీషరీఫ్: ప్రేమ వ్యవహారం కారణంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లో చోటుచేసుకున్న గిరిజన యువకుడి హత్యోదంతం ఘటన మరువక ముందే బాలాపూర్‌లో మరో గిరిజన యువకుడు బుధవారం రాత్రి దారుణ హత్యకు గురవడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుప్పగండ్ల కేస్లీతండాకు చెందిన డెకావత్ పూల్‌సింగ్ భార్యాపిల్లలతో 20 ఏళ్ల క్రితం షాహీన్‌నగర్‌లోని వాదే ఉమర్ బస్తీకి వలస వచ్చారు. మేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు పవన్ నాయక్(22) సంతానం. ఇంటర్ పూర్తి చేసి ప్రస్తుతం చదువు మానేసిన పవన్ ఏడాది నుంచి సమీప బస్తీలో ఉండే వేరే వర్గానికి చెందిన యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం యువతి ఇంట్లో తెలియడంతో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి 11 గంటల సమయంలో పవన్ మూత్ర విసర్జన కోసం బయటికి వచ్చాడు. అప్పటికే కాపుకాసి ఉన్న యువతి కుటుంబ సభ్యులైలు సద్దాం, గౌస్ కత్తులతో దాడికి తెగబడ్డారు. కడుపు, వీపు, మెడ భాగాల్లో విచక్షణా రహితంగా పొడిచి పరారయ్యారు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా పవన్ మార్గమధ్యలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మహేశ్వరం డీసీపీ సి.హెచ్.శ్రీనివాస్, ఏసీపీ అంజయ్య, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పవన్ మృతి విషయం తెలుసుకున్న బంధుమిత్రులు పెద్ద ఎత్తున బాలాపూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఆందోళనకు దిగారు. కాగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిందితులకు నేర చరిత్ర ఉన్నట్లు తెలిసింది.

డబ్బు ఇస్తామన్నా.. పొట్టన బెట్టుకున్నారు

ఇరు కుటుంబాల నడుమ గొడవలు నెలకొన్న సమయంలో మధ్యవర్తులు డబ్బులతో రాజీ ప్రతిపాదన చేయకుండా ఉంటే పవన్ హత్య జరిగేది కాదని మృతుడి బంధువులు ఆవేదన వ్యక్తంచేశారు. వారు అడిగిన డబ్బు కొద్ది సమయంలో ఇస్తామని చెప్పినా తమ కొడుకును పొట్టన పెట్టుకున్నారని మృతుడి తండ్రి పూల్‌సింగ్ బోరున విలపించాడు.

గిరిజనులకు రక్షణ లేదు..

పవన్‌ను చంపిన కేసులో నేర చరిత్ర ఉన్న నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని బీజేపీ నేతలు టి.ఆచారి, బొక్క నర్సింహారెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్‌లు డిమాండ్ చేశారు. గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ భానావత్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు.

PUBLIC NOTICE

The general public is hereby informed that my Client **SMT. ANSHU AGARWAL,** W/o Mr. Sharad Agarwal, aged about 37 years, Occ: Housewife, R/o #5-9-22/1/14, Matadin Nivas, Adarshnagar, Hyderabad, T.S., agreed to purchase All that the part and parcel of **PLOT BEARING NO.165**, in **Survey No. 332/AA**, admeasuring **400 SQ. YARDS** in **"NATURE PARK"**, situated at Rangapur, Nandigama Revenue & Mandal, Ranga Reddy District, T.S., and is Bounded by:-**NORTH: 40 Feet Road, SOUTH: Plot No. 164, EAST : 33 Feet Road, WEST: Plot No. 146, from DR. CHUKKA MALLIKARJUN,** S/o Late CHUKKA HANUMANDLU, aged about 71 years, Occupation: Consultant Pediatrician, R/o H.No.7-43-457/206, Mahesh Nagar, ECIL Post, Kapra, Hyderabad Road, T.S., Any person(s) having any objection(s), charge, claim, lien over the said property shall approach the undersigned office within **SEVEN (7)** days from the date of this publication. No objection/ claim of whatsoever in nature, will be considered after the specified period and registration as per law will be procured.

Sd/- ANSHUL AGARWAL
Advocate
#1-2-298, Amarnath Kunj, St No.7,
Domalguda, Hyderabad-500029, T.S.
PH No. 8801617471

PUBLIC NOTICE

The general public is hereby informed that my Client **SMT. ANSHU AGARWAL,** W/o Mr. Sharad Agarwal, aged about 37 years, Occ: Housewife, R/o #5-9-22/1/14, Matadin Nivas, Adarshnagar, Hyderabad, T.S., agreed to purchase All that the part and parcel of **PLOT BEARING NO.146**, in **Survey No. 332/AA**, admeasuring **400 SQ. YARDS** in **"NATURE PARK"**, situated at Rangapur, Nandigama Revenue & Mandal, Ranga Reddy District, T.S., and Bounded by:-**NORTH: 40 Feet Road, SOUTH: Plot No. 147, EAST : Plot No.165, WEST: 33 Feet Road, from DR. MRS. J. ARUNA,** W/o DR. CH. MALLIKARJUN, aged about 70 years, Occupation: Consultant Obstetrician & Gynecologist, R/o H.No. 7-43-457/206, Mahesh Nagar, ECIL Post, Kapra, Hyderabad Road,T.S., Any person(s) having any objection(s), charge, claim, lien over the said property shall approach the undersigned office within **SEVEN (7)** days from the date of this publication. No objection/claim of whatsoever in nature, will be considered after the specified period and registration as per law will be procured.

Sd/- ANSHUL AGARWAL
Advocate
#1-2-298, Amarnath Kunj, St No.7,
Domalguda, Hyderabad-500029, T.S.
PH No. 8801617471

బహిరంగ ప్రకటన

మా క్లయింటు **రంగారెడ్డి జిల్లా, హైదర్‌షాకోట్‌లోని లక్ష్మీనగర్‌లోని డోర్ నెం.4-11/1 కాపురస్తులు పామర్తి శ్రీరామకృష్ణ మూర్తి గారి కుమారుడు సూర్యనారాయణ మూర్తి గారు మాకు ఇచ్చిన సంజాయిషీపై** ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా.

మా క్లయింటు, **వారి సోదరులైన శ్రీరామచంద్రమూర్తిగారు, కాశీ విశ్వేశ్వరరావుగారు మరియు వారి తల్లిగారైన అన్నపూర్ణమ్మ గార్లు కలిసి ది.06-02-1961 సంగరం తేదీన సూరవరపు వెంకటరత్నం మరియు వారి కుమారుడైన గంగరాజు గార్ల వద్ద నుండి పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు మండలంలోని సజ్జాపురంలోని రి.స.నెం.42/3లోని చ.గ 415-2-6 లు ఖాళీ నివేశన స్థలమును క్రయం పొంది సదరు దస్తావేజును తణుకు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో దస్తావేజు నెం.313/1961గా రిజిష్టరు చేయించి సదరు దస్తావేజును మా క్లయింటుకు ఇచ్చియున్నారు.**

దుర్మిలా సదరు దస్తావేజు నెం.313/1961 ను మా క్లయింటు బయటకు జిరాక్స్ తీయించుటకు వెళ్ళుచుండగా సదరు దస్తావేజు పడిపోయినది. అందుకై మా క్లయింటు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇవ్వగా పోలీసు వారు ది.27-02-2023న దస్తావేజు గురించి వెతకగా దొరకలేదని సర్టిఫికెట్ ఇచ్చినారు. సదరు కంప్లైంట్ నెం.15202702231349283409గా నమోదు చేయబడినది.

కావున సదరు ఒరిజినల్ మా క్లయింటు వద్ద పోయినది. సదరు దస్తావేజుకు వారు శ్రీ తణుకు సబ్-రిజిస్ట్రార్ వారి ఆఫీస్ నుండి ది.**06-03-2023** తేదీన నకలు తీసుకొనియున్నారు. **సదరు ఆస్తిని వారు ఎవ్వరికి ఎట్టి తనఖా గానీ, క్రయములు గానీ పెట్టియుండలేదు. సదరు ఆస్తిపై వారు ఎట్టి లావాదేవీలు జరిపియుండలేదు. కావున ఇందుపై** ఎవరికైనా అభ్యంతరములు ఉన్నయెడల ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజులలోగా ఈ క్రింది అడ్రస్ వారికి లిఖితపూర్వకంగా తెలియజేయవలెను. సదరు గడువులోపున ఎట్టి అభ్యంతరములు రానియెడల సదరు నకలును బట్టి సదరు ఆస్తిపై లావాదేవీలు జరుపబడును.

షెడ్యూలు

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు (ప్రస్తుతం సజ్జాపురం) సబ్ రిజిస్ట్రార్ వారి పరిధిలో చేరిన సజ్జాపురం గ్రామంలోని రి.స.నెం.42/3లోని చ.గ. 415-2-6 లుకు హద్దులు:

తూర్పు: రావిపాటి వెంకటేశ్వరరావు వగైరాల స్థలం 74'9", **దక్షిణం:** పంచాయతీ బోర్డు రోడ్డు 50',
పడమర: గుత్తిన సూర్యనారాయణ తాలూకు స్థలం 75', **ఉత్తరం:** పంచాయతీ రోడ్డు 50'

ఈ హద్దుల మధ్య 415-2-6 చ.గజముల స్థలం, అందుకు సంబంధించిన మాములు రాకపోకల హక్కులు సహాయున్నూ, యావత్తు ఈజిమెంటు హక్కులు సహాయున్నూ.

కె.వి.ఎస్. కామ శాస్త్రి, అడ్వకేట్
26-4-2, N.S.C. బోస్ రోడ్, తణుకు-534211. ఆంధ్రప్రదేశ్. మొబైల్: 9440082000
తేది: 09-03-2023

రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న కేంద్రం

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆరోపించారు. సీఎం కేసీఆర్‌ను ఎదుర్కోలేక ఎమ్మెల్సీ కవితను బీజేపీ టార్గెట్ చేసిందని ఆయన ఆరోపించారు. ఆమనగల్లు మండలం కోనాపూర్‌కు చెందిన బొడ్డుపల్లి నిఖిల్‌కు సీఎం సహాయనిధి నుంచి రూ. 2.50లక్షలు, మంగళపల్లి గ్రామానికి చెందిన లింగారెడ్డికి రూ. 20 వేలు మంజూరు కాగా హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా దర్యాప్తు సంస్థలను భ్రష్టు పట్టించి వాటి విశ్వసనీయతను దెబ్బతీసిందని, కేవలం ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలకు ఈడీ సీబీఐ, ఐటీ లాంటి సంస్థలను వాడుకుంటోందని ఆయన విమర్శించారు. సీఎం కేసీఆర్‌ను బీజేపీ ఎదుర్కోలేక ఎమ్మెల్సీ కవితపై కక్షపూరితంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు సంస్థలచే నోటీసులు ఇప్పించిందని ఆయన ఆరోపించారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే నోటీసులు ఇచ్చారని, కేంద్రం చేస్తున్న దుర్మార్గపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, మున్సిపాలిటీ టీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు గుత్తి బాలస్వామి, సత్యం, రమేశ్, మల్లేశ్, బొడ్డుపల్లి సంజీవ, కడారి రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో 40 మందిపై కేసు

చేవెళ్ల: దామరగిద్ద గ్రామంలో శ్మశానవాటిక విషయంలో బుధవారం రాత్రి జరిగిన ఇరువర్గాలు దాడి ఘటనలో 40 మందిపై కేసు నమోదు చేసినట్లు చేవెళ్ల ఎస్ఐ హయ్యూమ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలో కొన్ని రోజులుగా శ్మశానవాటిక స్థలం విషయంలో బీసీ, ఎస్సీ వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ పంచాయితీ మంత్రి, ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి వెళ్లింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు సమయం కోరారు. ఇవేవీ పట్టించుకోని రెండు వర్గాలు బుధవారం రాత్రి గొడవ పడ్డాయి. కర్రలతో దాడి చేసుకున్నారు. దాడికి పాల్పడిన ఇరు వర్గాలకు చెందిన 40 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హయ్యూమ్ తెలిపారు.





ఇబ్రహీంపట్నం రూరల్: పటేల్‌గూడలో ప్రచారం చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు, కరపత్రం ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

పోటాపోటీగా ఎమ్మెల్సీ ప్రచారం

పీఆర్‌టీయూ ఓ వైపు యూటీఎఫ్ మరో వైపు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రచారం జోరందుకుంది. ఇబ్రహీంపట్నం మండలం, ఆదిబట్ల మున్సిపాలిటీల్లో పీఆర్‌టీయూ, యూటీఎఫ్ నాయకులు జోరుగా ప్రచారం సాగించారు. మొదటి ప్రాధాన్యత ఓటు మా అభ్యర్థికే వేయాలని కోరుతున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రదక్షిణలు చేస్తున్నారు. గురువారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఏవీఎస్, శ్రీదత్త, భారత్, శ్రీఇందు, విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలల్లో అధ్యాపకులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్దన్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు పరమేష్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి, నాయకులు ఉపేందర్‌రెడ్డి, భానుప్రసాద్‌రెడ్డి, దయాకర్, మధుసూదన్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కోటయ్య, వీరబాబు, నరేష్, వెంకటరెడ్డి, చంద్రశేఖర్, లింగరావు, కృష్ణారెడ్డి, రంగారెడ్డి, శ్రీకాంత్, అంకులయ్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా యూటీఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ గురువారం పీఆర్‌టీయూ నేతలు ఎల్మినేడు, ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలల్లో, బొంగ్లూర్ ఆదర్శ పాఠశాలలో ప్రచారం జోరుగా నిర్వహించారు. విద్యారంగ వికాసం కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, కిరణ్ కుమార్, రవి, ఆనంద్, శ్రీనివాస్, బాలాజీ, ప్రవీణ్‌కుమార్, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించండి

మంచాల: టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్న గారి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి కోరారు. గురువారం మంచాల మండలం మంచాల, రంగాపూర్, ఆరుట్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూళ్లలో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలపై అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న వ్యక్తి మాణిక్‌రెడ్డి అన్నారు. అతనికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఏర్పుల గాలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుగంధ, జిల్లా కార్యదర్శి కిషన్ చౌహాన్, మండల అధ్యక్షుడు అజ్మత్ ఖాన్, ప్రధాన కార్యదర్శి బాలు నాయక్, యాచారం మండల అధ్యక్షుడు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు మోతీలాల్, మండల క్యాదర్శి వెంకటాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినయ్‌బాబాను గెలిపించాలి

చేవెళ్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ అర్రం వినయ్‌బాబాను గెలిపించాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం వ్యవస్థపక అధ్యక్షుడు వీ సత్యనారాయణ కోరారు. మండలంలోని ముడిమ్యాల, గొల్లపల్లి సమీపంలో ఉన్న కొండగల్, వాబుపేట గురుకుల పాఠశాలల్లో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల అధ్యాపకుల, ఉపాధ్యాయుల కోసం తన జీవితాన్ని తాగ్యం చేసిన ప్రొఫెసర్ అర్రం వినయ్‌బాబాను ఎమ్మెల్సీగా గెలిపించుకుంటే సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఆయన నిరతరం కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో కొండగల్ గురుకుల పాఠవాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, నవాబుపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కే వెంకట్‌రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేశంపేట మండలంలో..

కేశంపేట: మండలంలో గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. నిద్రవెల్లి, కాకునూరు, కొండారెడ్డిపల్లి, వేముల నర్వ, పాపిరెడ్డిగూడ, ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూ సంఘం నాయకులు ప్రచారం చేశారు, కార్యక్రమంలో సంఘం నాయకులు రంగారెడ్డి, మహేందర్, శ్రీనివాస్‌సాగర్, కరుణాకర్, నందిగామ సురేష్, అబ్దుల్‌చారి, రాంకిసన్, సోంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..

ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి తరపున ఎస్ఎస్‌యూఐ నాయకులు మండలంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కందూరి శివ ప్రసాద్, సందీప్, మహేష్, విష్ణు, సాయి బన్నీ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: కొండగల్ పాఠశాలలో ప్రచారం చేస్తున్న సత్యనారాయణ



మంచాల: ఆరుట్ల మోడల్ స్కూల్‌లో ప్రచారం చేస్తున్న రవి తదితరులు

మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి

సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ రాజ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ రాజ్యలక్ష్మిని న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. జనాభాలో సగభాగం మహిళలు వెనకబడి ఉన్నారని, విద్యావంతులైన మహిళలు మాత్రమే రాణించగలుగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ప్రిన్సిపల్ జూనియర్, సివిల్ జడ్జి జీవన్ సూరజ్‌సింగ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకు పుట్టిందే 'డీఎస్పీ'

మహేశ్వరం: దేశంలో అణగారిన వర్గాల విముక్తి కోసం రూపొందించిన రాజ్యాంగాన్ని రక్షించడానికి పుట్టిందే డీఎస్పీ అని దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు డా. విశారదన్ మహరాజ్ అన్నారు. గురువారం మండలంలోని దుబ్బచర్ల, కోళ్లపడకల్, పోరండ్ల గ్రామాలకు స్వరాజ్య పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అగ్రకులాల చేతిలో బడుగు బలహీన వర్గాలు అణచివేతకు, దౌర్జన్యాలకు, అన్యాయాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 10 శాతం లేని రెడ్డి, వెలమ దొరల రాజ్యం మనకెందుకని ప్రశ్నించారు. 90 శాతం ఉన్న సబ్బండ కులాల పాలనలో సంపూర్ణ న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమం డీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షుడు రాకేష్, మండల అధ్యక్షుడు పీ దేవేందర్, జిల్లా నాయకులు జంగయ్య పాల్గొన్నారు.

నా చావుకు భార్య, అత్తే కారణం

- సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న భర్త
- పెద్దమ్మ తండాలో ఘటన

కందుకూరు: నా చావుకు భార్య, అత్తే కారణమంటూ ఓ వ్యక్తి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కృష్ణంరాజు కథనం మేరకు.. మండలంలోని పెద్దమ్మ తండాకు చెందిన సభావత్ జీవన్(21)కు రెండేళ్ల క్రితం బాలాపూర్ మండలం కుర్మగడ్డ తండాకు చెందిన లావణ్యతో వివాహం జరిగింది. జీవన్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. హైదరాబాద్ బండ్లగూడలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. వారికి ఆరు నెలల బాబు ఉన్నాడు. కొంత కాలంగా భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్యతో పాటు అత్త లక్ష్మి, బావమరిది రమేష్ సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టేవారు. దీంతో మనస్థాపం చెందిన జీవన్ భార్యను అక్కడే వదిలేసి మూడు రోజులుగా పెద్దమ్మ తండాకు వచ్చి ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున విషయాన్ని గుర్తించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. అతను రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



సీఐ శివకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనవాడ ప్రజలు

శంకర్‌పల్లి: మండలంలోని మిర్జాగూడ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న యువకుడిపై దాడి చేసి అతని మృతికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని జనవాడ గ్రామస్తులు నార్సింగ్ సీఐ శివకుమార్‌ను కోరారు. గురువారం పంచాయతీ వార్డు సభ్యులు, యువజన సంఘాల యువకులు, గ్రామస్తులు గురువారం సీఐని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవాడ గ్రామానికి చెందిన మద్దూరి మల్లేశం, అంతిగళ్ల అశోక్, టంగటూరి నరేష్ మూడు రోజుల క్రితం మిర్జాగూడ శివారులోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న ప్రొద్దటూరు గ్రామానికి చెందిన సంజయ్ కుమార్‌పై దాడి చేసి అతని మరణానికి కారకులయ్యారని తెలిపారు. అకారణంగా సంజయ్ ప్రాణాలు తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులపై గతంలో నేర చరిత్ర ఉందని, అనవసర విషయాల్లో జోక్యం చేసుకొని గ్రామానికి చెడ్డ పేరు తీసుకు వస్తున్నారని తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌడిచర్ల లలిత, ఎంపీటీసీ నాగేందర్, రాయదుర్గం పీఏసీఎస్ చైర్మన్ అరవింద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మైసయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

కేశంపేట: విధి నిర్వహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని పాపిరెడ్డిగూడలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె పరిశీలించారు. పరీక్షల కోసం వచ్చే వారికి ఎలాంటి వసతులు కల్పించారు, రికార్డుల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దృష్టి లోపం ఉన్నవారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కంటి సమస్య తీవ్రంగా ఉన్న వారిని గుర్తించి హైదరాబాద్‌లోని సరోజినీదేవి కంటి ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్యులు నజీం, శ్వేత, ఆప్తమాజలిస్టు కృష్ణ, ఇంద్రజ, ఏఎన్ఎంలు సంతోష, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం

షాద్‌నగర్ రూరల్: అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లిలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ఆమె పరిశీలించారు. కంటి వెలుగు శిబిరంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

రెగ్యులరైజేషన్‌కు మరో చాన్స్

- ఖాళీ స్థలాలు, నిర్మాణాల క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్
- జీఓ నంబర్ 58, 59 కింద ఇప్పటికే 31,830 దరఖాస్తులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. 2020 వరకు కబ్జాలో ఉన్న వారి భూముల రెగ్యులరైజేషన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గతంలో 2014 జూన్ 2కు ముందు ఆక్రమణల్లో ఉన్న వాటికి అవకాశం కల్పించింది. జీఓ నంబర్ 58 కింద నిర్మాణాలను ఉచితంగా క్రమబద్ధీకరించేందుకు, జీఓ నంబర్ 59కింద ఖాళీ స్థలాలను నామమాత్రపు ఫీజుతో రెగ్యులరైజేషన్‌కు చాన్స్ ఇచ్చారు. ఈ రెండు జీఓల కింద జిల్లా వ్యాప్తంగా 31, 830 దరఖాస్తులు అందాయి. వీటిలో 8, 484 దరఖాస్తులు ఖాళీ స్థలాలకు సంబంధించినవి కాగా, మిగిలినవన్నీ నిర్మాణాలకు సంబంధించినవే. జీఓ నంబర్ 58కింద అందిన అప్లికేషన్లను అధికారులు ఇప్పటికే వెరిఫికేషన్ చేసి, లబ్ధిదారులకు సమాచారం అందించారు. ఖాళీ స్థలాలకు మార్కెట్ ధర ప్రకారం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. చాలామంది ఈ చెల్లింపులకు వెనకాడారు. గురువారం మంత్రి మండలి సమావేశంలో ఈ అంశాన్ని కూడా చర్చించి.. దరఖాస్తుకు మరో అవకాశం కల్పించాలని నిర్ణయించారు. అసైన్డ్, ప్రభుత్వ, వక్ఫ్, భూ దాన్ భూములు, గ్రామ కంఠం భూముల్లో కబ్జాలో ఉన్నవారు సరైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

- పౌష్టికాహారంతో రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి
- జిల్లా శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోతీ



చౌదర్‌పల్లిలో మాట్లాడుతున్న మోతీ

యాచారం: ఆరోగ్యం విషయంలో మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోతీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చౌదర్‌పల్లిలో 'డిజిటల్ ఆల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నలజీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ' అంశంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నిరంగాల్లో విశేషంగా రాణిస్తున్న మహిళలు.. ఆరోగ్యపరమైన అంశాలను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు బాగుంటాయని స్పష్టంచేశారు. రోజుకోరకమైన కొత్త వైరస్‌లు, వ్యాధులు పుట్టుకొస్తున్నాయని, వీటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని, రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలని సూచించారు. సరైన ఆహార నియమాలు పాటిస్తే ఏ రోగాలు దరిచేరవని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారి, ఐసీడీఎస్ అధికారులు శాంతికుమారి పాల్గొన్నారు.